సాక్షి కామారెడ్డి
బుధవారం । 22 । జనవరి । 2025



జీవితానికి అవసరమయ్యే పాఠాలు..
మంచి జీవితానికి అవసరమయ్యే పాఠాలను నేర్చుకోవాలని ఇంపాక్ట్ ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు.
- 8లో ▸



ప్రాణాలు పోతున్నాయి..
అజాగ్రత్తగా వాహనాలను నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.1 /8.8
ఉదయం మంచు దట్టంగా కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

‘చట్టాలపై అవగాహన పెంచుకోవాలి’



కామారెడ్డి టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.నాగరాణి సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, మహిళలపై దాడులను అరికట్టడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రోజూ పౌష్టికాహారం అందించాలని హెచ్ఎంకు సూచించారు. గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్రవంతి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, హెచ్ఎం సావిత్రి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది శ్రవణ్, సాయిప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉపకరణాల పంపిణీకి అర్హుల ఎంపిక



కామారెడ్డి క్రైం: దివ్యాంగులకు అలీంకో సంస్థ ద్వారా అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. అలీంకో, జిల్లా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కేవీఎస్ గార్డెన్‌లో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కోసం ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గంలోని 572 మంది దివ్యాంగులు ఈ శిబిరంలో పాల్గొన్నారని కలెక్టర్ తెలిపారు. వీరికి అర్హతలను బట్టి అవసరమైన పరికరాలను అలీంకో సంస్థ ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్లు గడుస్తున్న సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, దోమకొండ, కామారెడ్డి సీడీపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 4వేల క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్టు ద్వారా 450 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టు ద్వారా 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

జిల్లాకు పామాయిల్ తయారీ యూనిట్!

- రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న యూనిలివర్ కంపెనీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం యూనిలివర్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర అధికారుల బృందంతో మంగళవారం యూనిలివర్ కంపెనీ ప్రతినిధులు జరిపిన చర్చల అనంతరం కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించారు. పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. పారిశ్రామికంగా వెనకబడిన కామారెడ్డి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు ఐదారేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. సదాశివనగర్ మండలం లింగంపల్లి, జనగామ శివార్లలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం సెజ్‌ను ఏర్పాటు చేశారు. పరిశ్రమల ఏర్పాటు కోసం మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇటీవలే ఓ కంపెనీ ఏర్పాటుకు భూమిపూజ జరిగింది. పనులు కొనసాగుతున్నాయి. మరిన్ని పరిశ్రమలు రావలసిన అవసరం ఉంది. ఇటీవలి కాలంలో జిల్లాలో ఆయిల్‌పాం తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆయిల్‌పాం తోటలు సాగవుతున్నాయి. జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటైతే ఆ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి.



నస్రుల్లాబాద్ మండలం అంకోల్‌లో గ్రామసభను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు

• ప్రజాపాలనలో

నిరసనల పర్వం

- గ్రామ/వార్డు సభల్లో పథకాల అర్హుల పేర్లు చదివిన అధికారులు
- తమ పేర్లు లేవంటూ నిలదీసిన ప్రజలు
- తొలిరోజు జిల్లా అంతటా ఇదే పరిస్థితి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే సర్వే పూర్తి చేసిన అధికారులు.. మంగళవారంనుంచి గ్రామసభల బాటపట్టారు. అయితే అర్హుల జాబితాలో పేర్లు లేనివారు నిరాశకు గురై అధికారులను నిలదీస్తున్నారు. గ్రామ సభల తొలిరోజు జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది.



జుక్కల్ మండలం చిన్నగుల్ల గ్రామసభలో ప్రజలతో చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్ విక్టర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోంది. మంగళవారం పంచాయతీలలో గ్రామ సభలు, బల్దియాలలో వార్డు సభలు ప్రారంభమయ్యాయి. అధికారులు ఆయా పథకాలకు సంబంధించి ఇటీవల నిర్వహించిన సర్వేల ద్వారా తయారు చేసిన అర్హుల జాబితాలను చదివి వినిపించారు. జాబితాల్లో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో చాలా గ్రామాల్లో ప్రజలు ఆగ్రహానికి గురయ్యారు. ప్రజాపాలనతోపాటు మీ సేవ కేంద్రాలలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నామని, అయినా తమను ఎందుకు ఎంపిక చేయలేదని అధికారులను నిలదీశారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే తప్పించుకునేందుకే మళ్లీ దరఖాస్తులు అంటున్నారంటూ ప్రజలు మండిపడ్డారు. కొన్నిచోట్ల ఇల్లు ఉన్న వారి పేర్లే ఇందిరమ్మ పథకం జాబితాలో ఉండడం, భూమి ఉన్న వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో చోటు దక్కడంతో నిరసన తెలిపారు.

జాబితాలు తిరస్కరిస్తూ తీర్మానాలు..

గాంధారి మండలం గౌరారం కలాన్‌లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితా మొత్తం అనర్హులతో ఉందని, దాన్ని తిరస్కరిస్తున్నామని గ్రామస్తులు తీర్మానం ప్రవేశపెట్టారు. తీర్మాన పత్రంపై పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేకాధికారి సంతకాలు చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు. రాజంపేట మండల కేంద్రంలో రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు విషయంలో గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అర్హులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. తాడ్వాయి మండలం కృష్ణాజీవాడిలో అర్హుల జాబితాల్లో తమ పేర్లు లేవని కొందరు నిలదీయగా, జాబితాలో పేర్లు రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అయితే ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదాశివనగర్ మండలంలోని పలు గ్రామాల్లో అనర్హులను జాబితాలో చేర్చారని ప్రజలు అధికారులను నిలదీశారు. జాబితాలను రద్దుచేయాలని కోరుతూ తీర్మానం చేశారు. నస్రుల్లాబాద్ మండలం అంకోల్ గ్రామంలో ఉపాధి హామీ పనులు జరగలేదని, దీంతో తమకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభను వాయిదా వేయాలంటే డిప్యూటీ తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. బిచ్కుంద మండలం ఫత్లాపూర్‌లో రేషన్ కార్డుల జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదంటూ పలువురు నిలదీశారు. బాన్సువాడ మండలం జక్కల్‌దాని తండాలో తమకు రుణమాఫీ కాలేదని కొందరు, రేషన్ కార్డుల జాబితాలో పేర్లు లేవని మరికొందరు నిరసన తెలిపారు. బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో ప్రజాపాలన సభలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ ఫ్లెక్సీలో తన ఫొటో పెట్టకపోవడంపై గొడవకు దిగారు. కామారెడ్డి పట్టణంలోని 41, 42, 43 వార్డులలో అలాగే 1 నుంచి 10 వార్డులలో గ్రామ సభలు నిర్వహించారు. రామేశ్వర్‌పల్లిలో సంక్షేమ పథకాల జాబితాలో తమ పేర్లు లేవని ప్రజలు అధికారులను నిలదీశారు.

జిల్లాలో తొలిరోజు 168 సభలు..

జిల్లాలో మంగళవారం తొలిరోజు 145 గ్రామ సభలు, మున్సిపాలిటీలకు సంబంధించి 23 వార్డు సభలు నిర్వహించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రజాపాలన సభలకు హాజరయ్యారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన భరోసా ఇచ్చారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉండడంతో వారు ప్రజాపాలన సభలకు హాజరుకాలేదు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కూడా స్థానికంగా లేరు. బాన్సువాడలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు వార్డు సభలలో పాల్గొన్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దోమకొండ, భిక్కనూరు మండలాల్లో, అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి ఎల్లారెడ్డి, లింగంపేట మండలాల్లో, అదనపు కలెక్టర్ వి.విక్టర్ బిచ్కుంద, బాన్సువాడ మండలాల్లో, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బాన్సువాడ పట్టణంతో పాటు నిజాంసాగర్ తదితర మండలాల్లో పర్యటించారు.

‘ఇది నిరంతర ప్రక్రియ’



మాచారెడ్డిలో ప్రజలతో చర్చిస్తున్న అధికారులు

మాచారెడ్డి: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ అనే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని డీపీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆర్డీవో నరేందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ఆయా పథకాల అర్హుల జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందవద్దన్నారు. పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో గోపి బాబు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘ప్రజలు అప్రమత్తంగా ఉండాలి’



కామారెడ్డి క్రైం: మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులు, హెర్బల్, హెల్త్ కేర్ ఇతర గృహోపకరణాల మార్కెటింగ్ పేరుతో కొత్త తరహా మోసాలు చాలా చోట్ల వెలుగు చూస్తున్నాయని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఇస్తామని చెప్పి మోసాలకు పాల్పడే మల్టీ లెవల్ మార్కెటింగ్ (పిరమిడ్ మోసాలు) మళ్లీ ప్రారంభం అయినట్లు తెలుస్తోందన్నారు. యాప్‌ల ద్వారా కొందరు, నేరుగా కార్యాలయాలు తెరిచి కొందరు గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి కంపెనీలు మొదట విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని, ఇంకా అనేక రకాల మాయమాటలు చెప్పి, ఆఫర్లు పెట్టి సభ్యత్వాలను స్వీకరిస్తాయని తెలిపారు. ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి మోసాలకు పాల్పడతారని పేర్కొన్నారు. ఇలాంటి స్కీంల విషయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. నమ్మించి, మభ్యపెట్టి డబ్బులు కొల్లగొట్టడమే మోసగాళ్ల పని అని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఇలాంటి మోసాల బారిన పడినవారు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు గానీ, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లోగానీ ఫిర్యాదు చేయాలని సూచించారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తాం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



లింగుపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

దోమకొండ: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం లింగుపల్లి గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులలో కుటుంబ సభ్యుల పేర్లను చేర్పించడానికి మీసేవ కేంద్రాలద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ముందుగా సొంత స్థలం ఉన్నవారిని గుర్తించి జాబితా తయారు చేయాలన్నారు. స్థలం లేనివారిని రెండో జాబితాలో చేర్చాలన్నారు. 40 ఏళ్లలోపు వితంతువులు, పారిశుధ్య కార్మికులు, అంగవైకల్యం ఉన్నవారు, భూమిలేని పేదలను ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ సంజయ్‌రావ్, ఈజీఎస్ ఏపీవో రజని, ఐకేపీ ఏపీఎం రాజు తదితరులున్నారు.

పేరు లేకున్నా ఆందోళన చెందొద్దు

భిక్కనూరు: సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలో పేరు లేదని ఆందోళన చెందవద్దని కలెక్టర్ సంగ్వాన్ పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి అర్హులకు పథకాలు అందేలా చూస్తామన్నారు. బాగిర్తిపల్లి గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తరేషన్ కార్డుల కొరకు దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రజిత, తహసీల్దార్ శివప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంటలతో నష్టం జరగలేదు

- ఉద్యాన క్షేత్రం పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తాం
- జిల్లా ఉద్యానశాఖ అధికారి జ్యోతి



మంటలు వ్యాపించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి జ్యోతి

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రంలో సోమవారం రాత్రి చెలరేగిన మంటల వల్ల ఉద్యాన క్షేత్రానికి ఎలాంటి నష్టం జరగలేదని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి తెలిపారు. ఆమె మంగళవారం ఉద్యాన క్షేత్రాన్ని పరిశీలించారు. స్థానిక ఉద్యాన శాఖ అధికారి కమలాకర్‌రెడ్డితో మాట్లాడి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. క్షేత్రం బయట గుర్తుతెలియని వ్యక్తులు పెట్టిన మంటలు గాలికి క్షేత్రంలోకి వ్యాపించి ఉంటాయని భావిస్తున్నామన్నారు. పండ్ల చెట్ల మధ్య విపరీతంగా పెరిగిన గడ్డితో మంటల తీవ్రత పెరిగిందన్నారు. కొంతకాలంగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఉద్యాన క్షేత్రంలో పనులు చేపట్టలేక పోతున్నామన్నారు. మంటల కారణంగా మామిడి తోటలోని 35 చెట్లు పాక్షికంగా కాలిపోయాయని, వాటికి నీటిని అందించి బతికిస్తామన్నారు. మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రం పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

2వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు లక్ష్యం..

జిల్లాలో ఈ ఏడాది 2 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని జ్యోతి తెలిపారు. ఇప్పటివరకు 657 ఎకరాలకు మంజూరు లభించిందని, అందులో 344 ఎకరాల్లో మొక్కలు నాటడం పూర్తయ్యిందని వివరించారు. ఆయిల్‌పాం, చెరుకు, కూరగాయలు సాగుచేసే రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందజేస్తున్నామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 3,500 ఎకరాల్లో చెరుకు తోటలకు డ్రిప్ పరికరాలను అందించాల్సి ఉండగా ఇప్పటివరకు 1,100 ఎకరాలకు డ్రిప్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 500 ఎకరాల్లో కూరగాయల సాగుకు డ్రిప్ పరికరాలను అందించామన్నారు. కార్యక్రమంలో మాల్తుమ్మెద, కామారెడ్డి, సదాశివనగర్ ఉద్యాన శాఖ అధికారులు కమలాకర్ రెడ్డి, రామకృష్ణ, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

- భిక్కనూరు మండల కేంద్రంలో 90 ఎకరాల భూముల్లో ఓ కెమికల్ ఫ్యాక్టరీ, పౌల్ట్రీఫాంలు, సలాక ఫ్యాక్టరీలు ఉన్నాయి. గతంలో ఆయా భూములకూ రైతుబంధు అందింది. మంగళవారం జరిగిన గ్రామ సభలో అధికారులు వివరాలు వెల్లడించారు.
- తాడ్వాయి మండల కేంద్రంలో 280 ఎకరాలకు పైగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. తాడ్వాయి గ్రామానికి చుట్టుపక్కల ఉన్న భూముల్లో చాలా వరకు సాగుకు యోగ్యం కానివని తేల్చారు. ఇందులో సోలార్ ప్లాంట్‌లు, రైస్‌మిల్లు, గుట్టలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, కాలేజీ క్రీడా ప్రాంగణం ఉన్నట్లు గుర్తించారు.
- కామారెడ్డి,మాచారెడ్డి, పాల్వంచ, భిక్కనూరు, బీబీపేట, దోమకొండ, తాడ్వాయి, రాజంపేట, సదాశివనగర్, గాంధారి, బాన్సువాడ, బిచ్కుంద, లింగంపేట, ఎల్లారెడ్డి తదితర మండలాల్లోనూ సాగుకు యోగ్యం కాని భూములకు రైతుబంధు అందినట్లు సర్వేలో తేలింది.

అనర్హులకూ రైతుబంధు

సర్వేలో వెలుగుచూసిన నిజాలు

- ఫ్యాక్టరీలు, రైస్‌మిల్లులు, గుట్టలు, వెంచర్లకూ అందిన పెట్టుబడి సాయం
- జిల్లాలో 7,525 ఎకరాలను గుర్తించిన అధికారులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో మొత్తం 5.24 లక్షల ఎకరాల భూమి ఉంది. గతంలో ఎకరాకు పంటకు రూ.5 వేల చొప్పున రైతుబంధు అందించారు. అయితే రాష్ట్రంలో అధికారం చేతులు మారాక రైతుబంధు పథకం పేరును రైతుభరోసాగా మార్చారు. ఇదే సమయంలో సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం అమలు కోసం సర్కారు ఇటీవల రైతుభరోసా సర్వే నిర్వహించింది. జిల్లాలో గతంలో ఇచ్చిన రైతుబంధులో సాగుకు యోగ్యంకాని భూములు 7,525 ఎకరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ లెక్క మరింత పెరిగే అవకాశాలున్నాయి.

రూ. 40 కోట్లకుపైగా దుర్వినియోగం

2018–19 ఆర్థిక సంవత్సరంలో రైతుబంధు పథకం ప్రారంభమైంది. అయితే అప్పట్లో ఎలాంటి నిబంధనలు పెట్టకపోవడంతో అందరికీ పెట్టుబడి సాయం అందింది. గుట్టలు, పుట్టలు, ఫ్యాక్టరీలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఏవి ఉన్నా రికార్డుల్లో భూమి ఉండి, యజమాని పేరు, వివరాలు ఉంటే చాలు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. 11 సీజన్లపాటు ఈ పథకం నిరాటంకంగా కొనసాగింది. మొదటి ఏడాది ఎకరానికి ఏడాదికి (రెండు పంటలకు కలిపి) రూ.8 వేల పెట్టుబడి సాయం అందించారు. తర్వాతి సంవత్సరంనుంచి ఎకరాకు రెండు పంటలకు కలిపి రూ.10 వేల చొప్పున ఇస్తూ వచ్చారు. గతేడాది యాసంగి సీజన్ వరకు ఈ పథకం కొనసాగింది. ఖరీఫ్ సీజన్‌లో మాత్రం ప్రభుత్వం రైతుబంధు ఇవ్వలేదు. ఈ యాసంగి సీజన్‌లో రైతుభరోసా పథకంగా పేరు మార్చి, పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహించింది. ఇందులో సాగుకు యోగ్యం కాని భూముల లెక్క తేల్చింది. జిల్లాలో సాగుకు యోగ్యం కాని 7,525 ఎకరాలకు రైతుబంధు అందిందని అధికారులు గుర్తించారు. ఈ భూములకు 11 సీజన్లలో కలిపి సుమారు రూ.40 కోట్ల వరకు భూ యజమానులకు అందించారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం..

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర కార్మిక సంక్షేమ మండలి ఇచ్చే స్కాలర్‌షిప్‌లకోసం కార్మికుల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ ఎం.కోటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్, బీసీఏ, ఎంబీఏ, బీఫార్మసీ తదితర కోర్సులు పాసైన వారు వచ్చేనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు కామారెడ్డి కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

‘విద్యా ప్రమాణాలు పెరుగుతున్నాయి’

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరుగుతున్నాయని జిల్లా పరీక్షల కమిషనర్ బలరాం పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి ఆర్ట్స్ కళాశాలలోని బాల్‌రాజ్‌గౌడ్ ఆడిటోరియంలో ఈఎల్‌టీఏ (ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆంగ్లంలో జిల్లాస్థాయి వక్తృత్వ, పదసంపతి ఒలంపియాడ్ రాత పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో కామారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేందర్, అధ్యాపకులు రాజ్‌గంభీర్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, ఈఎల్‌టీఏ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, శ్రీనివాస్‌యాదవ్, ప్రతినిధులు విష్ణువర్ధన్, లింగారెడ్డి, లక్ష్మీరాజం, మోహన్, నాగరాజు, శ్రీవాణి, శివరంజని, కల్పన, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఒలంపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఈఎల్‌టీఏ ప్రతినిధులు

క్లుప్తంగా

కవల దూడలకు జన్మనిచ్చిన ఆవు



రుద్రూర్: కోటగిరి మండలంలోని సుద్దులం గ్రామంలో మంగళవారం ఓ ఆవు కవల దూడలకు జన్మనిచ్చింది. గ్రామంలోని లక్ష్మణ్ అనే రైతుకు చెందిన ఆవుకు మంగళవారం రెండు దూడలకు జన్మించాయి. ప్రస్తుతం ఆవు, దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రజలు విషయం తెలుసుకుని చూసేందుకు వచ్చారు.

అజాగ్రత్త కారణంగా ప్రాణాలు పోతున్నాయ్



బిచ్కుంద(జుక్కల్): అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల విలువైన ప్రాణాలు పోతున్నాయని, ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం బిచ్కుంద మున్నూరు కాపు సంఘంలో పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అందరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని అన్నారు. నేషనల్ హైవేపై ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నానని తెలిపారు. వాహనాలపై చలానా ఉన్న కాంగ్రెస్ నేతలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్ ఇవ్వనని చెప్పారు. బిచ్కుందకు చెందిన సద్గురు బండాయప్ప గోల్డ్‌షాపు యజమాని ఎమ్మెల్యే చేతుల మీదుగా 30 హెల్మెట్లు పంపిణీ చేశారు. డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, సీఐ నరేష్, ఎస్సై మోహన్‌రెడ్డి, ఏఎంవీఐ కవిత, షాకీర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వారోత్సవాలకు రాని డ్రైవర్లు..

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముఖ్యంగా జీపు, ఆటో, స్కూల్ బస్సులు, మినీగూడ్స్ వాహనాలు, లారీ డ్రైవర్లకు అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. బిచ్కుందలో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాలకు ఒక్క డ్రైవర్ రాలేదు. డ్రైవర్ల స్థానంలో అధికారులు విద్యార్థులను తీసుకొచ్చి అవగాహన కల్పించడం గమనార్హం.

ఎవరిదీ నిర్లక్ష్యం..?



మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో కాలిపోయిన ఆయిల్‌పాం మొక్కలు

- మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో నెలకొన్న అగ్నిప్రమాదానికి బాధ్యులెవరు ..?
- ఉద్యానక్షేత్రంలో మంటలు చెలరేగడానికి పండ్లతోటల మధ్య దట్టంగా పెరిగిన గడ్డే కారణం
- నిర్వహణకు నిధులు లేవని చేతులెత్తేస్తున్న అధికారులు



ఉద్యానక్షేత్రంలో కాలిపోయిన పైపులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో మంటలు చెలరేగి సంభవించిన అగ్నిప్రమాదానికి ఎవరు బాధ్యత వహిస్తారో తెలియడంలేదు. ఉద్యానక్షేత్రంలో మామిడి, ఉసిరి, ఆయిల్‌పాం, జామ తోటలున్నాయి. సోమవారం రాత్రి ఆకస్మికంగా ఉద్యానక్షేత్రంలో పెద్దయెత్తున మంటలు చెలరేగాయి. దీనివల్ల క్షేత్రంలోని పండ్లతోటల మధ్య దట్టంగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కల వల్ల మంటలు వేగంగా వ్యాపించాయి. 60 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న ఉద్యానక్షేత్రంలో సోమవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంతో మంటలు 10 ఎకరాలకు పైగా వ్యాపించాయి. దీనివల్ల క్షేత్రంలోని ఆయిల్‌పాం చెట్లు పూర్తిగా కాలిపోయాయి. మామిడితోటలోని చెట్లకు సైతం మంటల సెగ తగిలి వాటి ఆకులు మాడిపోయాయి. ఉద్యానక్షేత్రం బయట వైపు గుర్తుతెలియని వ్యక్తులు పెట్టిన మంటలు గాలికి వ్యాపించి క్షేత్రంలోకి ప్రవేశించి అగ్నిప్రమాదం జరిగిందని ఉద్యానశాఖ అధికారులు భావిస్తున్నారు.

నిధులు లేవనే కారణంతో...

ఉద్యాన క్షేత్రం నిర్వహణకు కొంతకాలంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావడంలేదనే కారణంతో క్షేత్రం నిర్వహణ కుంటుపడింది. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో క్షేత్రంలోని పండ్లతోటల మధ్య గడ్డి, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. గతంలో ఉపాధిహామీ పథకం కింద క్షేత్రంలో కూలీల ద్వారా పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టామని, ఇప్పుడు ఉపాధిహామీ పథకంలో పొదల తొలగింపు పనులు చేపట్టే అవకాశం లేదని వారు చెబుతున్నారు.

నిర్వహణ గాలికి..

ఉద్యానక్షేత్రంలో రెగ్యులర్ అధికారిగా విధులు నిర్వహించిన హెచ్‌వో రామకృష్ణ గతేడాది ఆగస్టులో కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హెచ్‌వో కమలాకర్‌రెడ్డిని మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రానికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే హెచ్‌వో కమలాకర్‌రెడ్డిని డిప్యూటేషన్‌పై కరీంనగర్ జిల్లాకు పంపించారు. మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రం బాధ్యతలను సదాశివనగర్ హెచ్‌వో హర్షవర్ధన్‌కు అప్పగించారు. నెలరోజుల క్రితం హెచ్‌వో కమలాకర్‌రెడ్డికి మాల్తుమ్మెద ఉద్యానక్షేత్ర బాధ్యతలను తిరిగి అప్పగించారు. కాగా జిల్లాలో హార్టికల్చర్ అధికారుల కొరత ఉందనే కారణంతో హెచ్‌వో కమలాకర్‌రెడ్డికి కామారెడ్డి జిల్లాకేంద్రంలోని హార్టికల్చర్ కార్యాలయంలో బాధ్యతలను అప్పగించారు. ఈ పరిణామాల మధ్య మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రంలో నిర్వహణ కొరవడింది. ఫలితంగా ఐదు నెలలుగా ఉద్యానక్షేత్రంలోని పండ్లతోటలతోపాటు రహదారులు గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. దీంతో సోమవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదం వల్ల ఉద్యానక్షేత్రంలోని పంట్లతోటల మధ్య పెరిగిన గడ్డికి మంటలు అంటుకొని పంట్ల తోటలు దెబ్బతిన్నాయి.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- బాన్సువాడలో సబ్ కలెక్టర్ కిరణ్మయి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి, పక్కన ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని తాడ్కోల్ డబుల్ బెడ్ రూం కాలనీలో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాబితాలో పేర్లు లేనివారు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. తహసీల్దార్ వరప్రసాద్, మున్సిపల చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు ఖలేక్, నార్ల ఉదయ్, నార్ల సురేష్, అసద్, నగేష్, వెంకన్న, నర్సన్న, దాసరి శ్రీనివాస్, రయీస్, జమీర్ తదితరులున్నారు.

గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ విక్టర్



చిన్న దేవిసింగ్ తండా గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

బాన్సువాడ రూరల్/పెద్దకొడప్‌గల్: ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల జాబితాలో పేర్లు లేని వారు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ విక్టర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన బాన్సువాడ మండలం జక్కల్‌దానితండా, పెద్దకొడప్‌గల్ మండలం చిన్న దేవిసింగ్ తండాలలో జరిగిన గ్రామసభలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారుల జాబితాను గ్రామ సభలలో పంచాయతీ కార్యదర్శులు చదివి వినిపిస్తారన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతర ప్రక్రియ అన్నారు. కాగా పలువురు రైతులు తమకు రైతు రుణమాఫీ కాలేదని, రేషన్‌కార్డు జాబితాలో పేర్లు లేవని అభ్యంతరం తెలిపారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ఏడీఏ అరుణ, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి పథకాలు అందేలా చూస్తాం

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మెంగారం గ్రామ సభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన లింగంపేట మండలం మెంగారం జీపీలో, ఎల్లారెడ్డి పట్టణంలోని 8వ వార్డు, మండలంలోని బ్రాహ్మణపల్లి జీపీ గ్రామ సభలలో పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా కోసం ప్రజా పాలన గ్రామ సభలో దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేసి గ్రామ పంచాయితీల్లో జాబితాను ప్రదర్శించినట్లు వెల్లడించారు. అధికారుల ప్రకటించిన జాబితాలో పేర్లు రానివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ప్రజాపాలన గ్రామ సభలో దరఖాస్తు చేసుకోని కొత్త వారు సైతం ప్రస్తుత గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మాకం రాములు, తదితరులు పాల్గొన్నారు.

జీవితానికి అవసరమయ్యే పాఠాలను నేర్చుకోవాలి



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు నాగేశ్వర్‌రావు



హాజరైన విద్యార్థులు

కామారెడ్డి టౌన్: ప్రస్తుతం మారుతున్న సమాజంలో మంచి జీవితానికి, భవిష్యత్తుకు అవసరయ్యే పాఠాలను నేర్చుకోవాలని ప్రముఖ వక్తలు సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రెండోరోజు మంగళవారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంప నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి కావాలంటే యువత ఉద్యోగాల కోసం కాకుండా ఎంతో మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడానికి సిద్ధపడాలన్నారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శ్రీపాదరామ్ మాట్లాడుతూ.. కాలానికి అనుగుణంగా ప్రస్తుతం సమాజంలో ప్రతీ ఒక్కరికి కమ్యూనికేషన్, రిలేషన్‌షిప్, సేల్స్, లీడర్‌షిప్ స్కిల్స్ ఉంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు. భార్యభర్తలు, అత్తాకోడళ్ల మధ్య గొడవలను ఎలా తగ్గించుకోవాలో వివరించి అందిరిని నవ్వించారు. తెలంగాణ నార్కోటిక్ డిపార్ట్‌మెంట్ ఎస్పీ కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత దేశం కోసం యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ వక్తలు ప్రదీప్, బాలలత, వేణు, కల్యాణ్‌లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు మారుతి, ప్రతినిధులు బాలు, జైపాల్‌రెడ్డి, హరిధర్, తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు గురికావొద్దు

ఖలీల్‌వాడి: క్రిప్టో కరెన్సీ, ఆగ్రో గార్మెంట్స్, హెర్బల్, హెల్త్, గృహోపకరణాల ఉత్పత్తులను విక్రయించే ముసుగులో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వాటిని గ్రహించి జాగ్రత్తపడాలని సైబర్ ఏసీపీ వెంకటేశ్వర్ మంగళవారం పేర్కొన్నారు. మొదటగా కొంత సొమ్మును ఆశగా చూపి తర్వాత మోసం చేస్తారని ప్రజలు ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీస్‌స్టేషన్, 1930 హెల్ప్ లైన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి

- నేషనల్ హైవే ఇన్సిడెంట్స్ మేనేజర్ సౌరభ్ ప్రతాప్‌సింగ్



మద్నూర్(జుక్కల్): రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని నేషనల్ హైవే ఇన్సిడెంట్స్ మేనేజర్ సౌరభ్ ప్రతాప్‌సింగ్ సూచించారు. మేనూర్‌లో జాతీయ రహదారి-161లో గల మోడల్ స్కూల్, కళాశాల వద్ద మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే అత్యవసర సేవల కోసం ఫోన్ చేస్తే ప్రమాద బాధితులకు సహాయం చేసినవారమవుతామన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో బాధ్యాతాయుతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమన్నారు. పాదచారులు రోడ్డు దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్ వద్దనే దాటాలన్నారు. గ్రామస్తులు సర్వీస్ రోడ్లను ఉపయోగించుకోవాలని సర్వీస్ రోడ్డులో ప్రయాణించేటప్పుడు గంటకి 40 కిలోమీటర్ల వేగంలోనే వెళ్లాలన్నారు.


క్రైం కార్నర్

నిజాయితీ చాటిన ట్రాఫిక్ పోలీసులు



ఖలీల్‌వాడి: బంగారం పోగొట్టుకున్న వ్యక్తికి అతడి ఆచూకీ కనుగొని, పోగొట్టుకున్న బంగారం అందించి ట్రాఫిక్ పోలీసులు నిజాయితీని చాటుకున్నారు. నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం డ్రంకన్‌డ్రైవ్‌లో వాహనం పట్టుబడటంతో జమనతు ఉండేందుకు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన జనార్ధన్ మూడు గ్రాముల బంగారం కిందపడిపోయినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. దీని విలువ రూ.25 వేలు ఉంటుందన్నారు. ఆ బంగారం ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎండీ ఫైజుద్దీన్‌కి దొరకగా, సీసీ కెమెరాలలో బాధితుడిని గుర్తించి, మంగళవారం జనార్ధన్‌కు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఫైజుద్దీన్‌ను ట్రాఫిక్ సీఐ ప్రసాద్, సిబ్బంది అభినందించారు.

సీఈఐఆర్ ద్వారా 71 సెల్‌ఫోన్ల రికవరీ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో గతంలో పలువురు బాధితులు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకోగా, సీఈఐఆర్ ద్వారా 71 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు డీసీపీ(అడ్మిన్)బస్వారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం సెల్‌ఫోన్‌లను బాధితులకు అందించినట్లు ఆయన వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వారి సెల్‌ఫోన్లను వాడడంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా వారి సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్ పోర్టల్‌లో పూర్తి వివరాలను పొందుపర్చాలన్నారు. పోయిన సెల్‌ఫోన్‌ను త్వరగా పట్టుకుని బాధితులకు అందిస్తామన్నారు. సెల్‌ఫోన్లను అందించేందుకు కృషి చేసిన కానిస్టేబుళ్ల మాన్‌సింగ్, అనుషా, సుష్మలకు ప్రసంశపత్రాలను అందజేశారు.

బోధన్ టౌన్‌కు రెండో స్థానం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో జనవరిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించడంలో బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ రెండోస్థానం దక్కించుకుంది. ఈసందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మాన్‌సింగ్ జిల్లా ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జనవరిలో 38ఫోన్లను రికవరీ చేసినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

కొడుక్కి తలకొరివి పెట్టిన తల్లి



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా అతడి తల్లి తలకొరివి పట్టి, అంత్యక్రియలు నిర్వహించింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండకు చెందిన గుండా రాజేశ్(33) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ధర్పల్లి నుంచి దోమకొండకు వస్తుండగా, రామారెడ్డి శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మంగళవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా తల్లి కుమారుడికి తలకొరివి పెట్టింది. మృతుడికి భార్య పద్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హోంగార్డు ఆత్మహత్యాయత్నం

- కాపాడిన రైల్వే పోలీసులు



హోంగార్డును కాపాడిన రైల్వేపోలీసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లోని రైల్వే పట్టాలపై హోంగార్డు ఆత్మహత్యకు యత్నించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. మంగళవారం ఉదయం 5.55గం.కు రైల్వే స్టేషన్ పట్టాలపై ఒక వ్యక్తి సూసైడ్ చేసుకుంటున్నాడని డయల్ 100కు కాల్ వచ్చింది. దీంతో వారు వెంటనే రైల్వే పోలీస్‌స్టేషన్‌లోని పోలీసు సిబ్బంది కుబేరుడు, రాములను తనిఖీకి పంపించారు. ప్లాట్‌ఫాం-3 పట్టాలపై ఒక వ్యక్తి పట్టాలపై కూర్చొని ఉండగా అతడిని పట్టుకుని వచ్చి రైల్వేస్టేషన్‌లో విచారించారు. అతడు తన పేరు తాటికొండ నర్సయ్య అని హోంగార్డుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తన భార్య, అత్తమామల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు తెలిపారు. అనంతరం అతడిని నాలుగోటౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

పాత నాణాలకు రూ.లక్షలు ఇస్తామంటూ మోసం

బాన్సువాడ: పాత నాణాలు ఇస్తే రూ.99లక్షలు ఇస్తామంటూ సైబర్ నేరగాళ్ల చేసిన మోసానికి ఓ వ్యక్తి మోసపోయాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. బీర్కూర్ గ్రామానికి చెందిన నర్రె గంగారాం బతుకు దెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా ఇటీవల బీర్కూర్‌కు వచ్చిన ఆయనకు ఇన్‌స్టాగామ్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. పాత నాణేలు ఇస్తే రూ.99 లక్షలు ఇస్తామని చెప్పడంతో వెంటనే అందులో ఉన్న నంబర్‌కు గంగారాం ఫోన్ చేశాడు. రూపాయి, ఐదు, పది, 25, 50 పైసల నాణేలతో పాటు రూ.20, రూ.100, రూ.200 నోట్లు తీసుకుని రూ.99 లక్షలు ఇస్తామని చెప్పడంతో గంగారాం నమ్మాడు. ఇందుకు కొంత ఖర్చు అవుతుందని తెలపడంతో గంగారాం విడతల వారీగా రూ.1.80లక్షలు ఓ డిజిటల్ యాప్ ద్వారా సైబర్ నేరగాళ్లకు చెల్లించాడు. ఈ నెల 17న మళ్లీ నేరగాళ్లు ఫోన్ చేసి రూ.99 లక్షలు ఇవ్వాలంటే ఎయిర్‌పోర్టుకు కారు, రక్షణ సిబ్బందికి, జీఎస్టీకి కలిపి రూ.లక్ష ఖర్చు అవుతుందని ఆ నగదు పంపించాలని చెప్పారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన గంగారాం బీర్కూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న బైక్

- బాలుడి మృతి.. ముగ్గురికి గాయాలు



టిల్లు (ఫైల్)


ఇందల్వాయి: మండలంలోని కొటాల్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం ఓ బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మూడేళ్ల బాలుడు మృతిచెందగా ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. మాచారెడ్డి మండలం రాజంపేట్ గ్రామానికి చెందిన రజనీకాంత్, గౌతమి దంపతులకు ఇద్దరు కుమారులు టిల్లు, రియాన్ష్ ఉన్నారు. మంగళవారం వారంతా బైక్‌పై డొంకల్ గ్రామానికి వచ్చి, వారి బంధువు గాజ భూమయ్య అంత్యక్రియలకు హాజరయ్యారు. అనంతరం వారు బైక్‌పై రాజంపేట్ వెళుతుండగా కొటాల్‌పల్లి గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈఘటనలో టిల్లు(3)కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగితా ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదంపై స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు బాలుడి మేనమామ గణేష్ తెలిపారు.

మాజీ విండో చైర్మన్ ఆత్మహత్య



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం మాజీ విండో చైర్మన్ జనగామ ప్రభాకర్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన జనగామ ప్రభాకర్ రెడ్డి(66) ఇటీవల తన కుమారుడికి వివాహం జరిపించాడు. గత కొన్ని రోజులుగా కుటుంబంలో తగాదాలు రావడంతో కోడలు కేసు వేసింది. ప్రస్తుతం కేసు కొనసాగుతుంది. దీంతో ప్రభాకర్ రెడ్డి మనస్తాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు ప్రభాకర్ రెడ్డి గతంలో టీడీపీ మండలాధ్యక్షుడిగా, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, సింగిల్ విండో చైర్మన్, సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. రెండు సార్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేశారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాపర్ చోరీ



రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారులోని ఎత్తిపోతల పథకం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ కాయిల్స్‌ను దొంగిలించినట్లు ఎస్సై సందీప్ మంగళవారం తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ యోగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెయింట్ వేస్తూ కింద పడి ఒకరి మృతి

బాన్సువాడ: తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో మంగళవారం ఓ భవనంపై పెయింట్ వేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి ఒకరు మృతిచెందారు. సీఐ అశోక్ తెలిపిన వివరాలు ఇలా.. డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసముంటున్న నవీన్‌గౌడ్ తన ఇంటికి పెయింటింగ్ పనులను శాదుల్లా (45)కు అప్పగించాడు. దీంతో అతడు కర్రలు కట్టుకుని పెయింట్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో శాదుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన అన్నారు.